వైభవంగా మల్లన్న కల్యాణోత్సవం

- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్
- పూలాభిషేకం చేసిన ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, నాగేష్ ముదిరాజ్



మల్లన్నస్వామికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ దంపతులు



మల్లికార్జునస్వామికి పూలాభిషేకం చేసిన బీఆర్ఎస్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు

ముషీరాబాద్/చిక్కడపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ బాకారంలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంభ మల్లికార్జునస్వామి (మల్లన్న) కల్యాణ మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు తీసుకొచ్చి సంప్రదాయ పద్ధతిలో సమర్పించారు. బీఆర్ఎస్ నగర నాయకులు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, నాగేష్ ముదిరాజ్ స్వామి వారి కల్యాణోత్సవంలో పాల్గొని పూలాభిషేకం చేశారు. ఆలయ కమిటీ మేనేజింగ్ ట్రస్టీ నల్లవెల్లి అంజిరెడ్డి దంపతులు బోనం తీసుకువచ్చి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం పంచామృతాభిషేకాలు, అగ్నిగుండాల వెలిగింపు, అగ్నిగుండాల ప్రవేశం, గొలుసులు తెంపుట తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భ్రమరాంబికా మల్లికార్జునస్వామి(మల్లన్న) దేవాలయం ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన గంగతెప్ప ఊరేగింపునకు స్వామివివేకానందనగర్ నల్లపోచమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యులు ఎంటీ కృష్ణ, జ్ఞానేశ్వర్, ఆనంద్‌రావు స్వాగతం పలికారు. ముఖ్య అతిథులుగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గసభ్యులు పూస రాజు, బీజేవైఎం మహాకాళీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు మద్దూరి శివాజీ హాజరయ్యారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బింగి నవీన్, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ నాయకులు రజినీకాంత్‌గౌడ్, ముప్పిడి నర్సింగ్‌రావు పాల్గొన్నారు

కనులపండువగా కరినోము ఉత్సవం



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు

చిక్కడపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా బుధవారం చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో కనుమ పండును పురస్కరించుకుని శ్రీ గోదా అమ్మవారి కరినోము ఉత్సవం కన్నులపండుగగా నిర్వహించారు. ఉత్సవంలో మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదం, తాంబూలం, నోము ప్రసాదాలుగా స్టీలుప్లేట్లను అందజేశారు. ఆలయ ఈవో అన్నపూర్ణ, వ్యవస్థాపక వంశీయుడు శ్రీనాథ్‌గౌడ్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడిగా ప్రశాంత్‌జోషి



నల్లకుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నల్లకుంట డివిజన్ అధ్యక్షుడిగా బీజేవైఎం గ్రేటర్ హైదరాబాద్ యువమోర్చా అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్న కె.ప్రశాంత్ జోషి నియమితులయ్యారు. తనకు బాధ్యతలు అప్పగించిన కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నల్లకుంట కార్పొరేటర్ యాకర.అమృతలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

25న రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు

ముషీరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రంగానగర్ యువజన సేవా సంఘం ఎన్నికలు ఈ నెల 25న నిర్వహించనున్నట్లు సంఘం నాయకులు, వై.మల్లేష్, శంకర్, ఈశ్వర్, నర్సింగ్‌రావు తెలిపారు. బుధవారం రంగానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 19వ తేదీలోపు అభ్యర్థులు తమ నామినేషన్లను అందజేయాలని కోరారు. 25వ తేదీ ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పోలింగ్ నిర్వహించి సాయంత్రం ఫలితాలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

రేపు బీసీ మేధావుల రాష్ట్ర సదస్సు

- కులగణన సర్వేను నూరు శాతం పూర్తి చేయాలి

బర్కత్‌పుర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీల రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు.బుధవారం కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సమగ్ర కులగణన సర్వే పూర్తి కాలేన్నారు. జనాభా దామాషా ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా ఈ నెల 17న ఉదయం 10 గంటలకు కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో బీసీ మేధావుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన తెలిపారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించాలి

- ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వినతి

నల్లకుంట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు తీవ్ర హాని కల్పిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను తక్షణమే రాష్ట్రంలో పూర్తి స్థాయిలో నిషేధించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా ప్లాస్టిక్ క్యారీ బ్యాగులతో ప్రకృతి విధ్వంసం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ లక్షా 50 వేల కోట్లతో మూసీనది ప్రక్షాళన, చెరువుల పరిరక్షణకు హైడ్రా వంటి ప్రత్యేక చట్టంతో సాహసోపేత నిర్ణయాలు తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగులపై దృష్టి సారించకపోవడం బాధాకరమన్నారు. ఈ విషయంపై ఇటీవల తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి రవి గుగులోతును కలిసి వివరించామని ఆయన గుర్తు చేశారు. ఇందుకు స్పందించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యదర్శి సింగిల్ యూజ్ వాడకాలపై, అమ్మకాలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామన్నారని, అయితే నిషేధం మాత్రమే నిజమైన పరిష్కారమని, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

తాగిన మత్తులో దొంగతనానికి వచ్చి

ఫ్లైఓవర్ పై నుంచి దూకిన వ్యక్తికి తీవ్రగాయాలు

అంబర్‌పేట, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): తాగిన మత్తులో దొంగతనానికి వచ్చిన ఓ వ్యక్తి స్థానికులు కేక వేయడంతో ఫ్లైఓవర్ నుంచి దూకడంతో తీవ్రంగా గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఫలక్‌నామాకు చెందిన రాములు (55) మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో అంబర్‌పేట శ్రీరమణ చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద ఉన్న ఇనుపరాడ్లు దొంగతనం చేయడానికి వచ్చాడు. అతడు మద్యం తాగి ఫ్లైఓవర్‌పై ఉన్న రాడ్లు దొంగతనం చేస్తుండగా నిర్మాణ కూలీలు గమనించి కేకలు వేశారు. కంగారుపడిన రాములు ఫ్లైఓవర్ పై నుంచి కిందికి దూకాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం అంబర్‌పేట పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు ప్రమాదాలలో రైలు ఢీకొని ఇద్దరి మృతి

బర్కత్‌పుర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు రైలు ప్రమాదాలలో రైలు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతిచెందారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం. ఉప్పుగూడ రైల్వేస్టేషన్ సమీపంలో 40 ఏళ్ల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. మరో ఘటనలో బుద్వేల్- ఉందానగర్ రైల్వేస్టేషన్ల నడుమ 65 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. రెండు ఘటనల్లో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బాపూజీ నగర్‌లో అగ్నిప్రమాదం



కాలి బూడిదైన వస్తువులు

ముషీరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో మంగళవారం అగ్నిప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే... శ్రీకాంత్, నిఖిల దంపతులు బాపూజీనగర్ లో నివసిస్తున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పూజా సామగ్రి కొనేందుకు బయటకు వెళ్లారు. ఈ క్రమంలో షార్ట్ సర్క్యూట్ వల్ల మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న వస్తువులకు అంటుకున్నాయి. స్థానికులు ఇంటి తలుపులు తెరిచి నీళ్లు చల్లి మంటలను ఆర్పివేశారు. ప్రమాదంలో వాషింగ్ మిషన్, కూలర్, ఫ్యాన్‌లు, టీవీ, ఫ్రిజ్, దుస్తులు, నిత్యవసర సరుకులు కాలి బూడిదయ్యాయి. దాదాపు లక్ష రూపాయల వరకు ఆస్తినష్టం జరిగిందని శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.



బుల్లితెర నటుడు కౌశిక్‌కు పురస్కారం బహూకరిస్తున్న నరసింహారావు, రామరాజు

దీక్షతో ఏ రంగంలోనైనా రాణించొచ్చు

చిక్కడపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): దీక్షతో ఏ రంగంలోనైనా రాణించవచ్చునని ప్రముఖ సినీదర్శకులు రేలంగి నరసింహారావు అన్నారు. అలాంటి వ్యక్తిత్వం ఉన్నత స్థాయిని సినీనటుడు శోభన్‌బాబు గతంలో అందుకున్నారన్నారు. వంశీ ఇంటర్నేషనల్(ఇండియా) ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయగానసభలో శోభన్‌బాబు 89వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా బుల్లితెర నటుడు కౌశిక్‌కు.. శోభన్‌బాబు వంశీ గ్లోబల్ స్మారక పురస్కారం ప్రదానం చేశారు. అనంతరం రేలంగి నరసింహారావు మాట్లాడుతూ కౌశిక్ గొప్ప నటుడుగా బుల్లితెరలో రాణిస్తున్నారన్నారు. వంశీ రామరాజు మాట్లాడుతూ శోభన్‌బాబు యాభైఏళ్ళ నాడు వంశీ సంస్థను ప్రారంభించారన్నారు. నటులు శంకర్, బాలాఇత్య, వైఎస్ రామకృష్ణ, వెంకట్, వీణ, లలిత, అఖిల, అనిత, సుధామయి, శైలజ పాల్గొన్నారు.



రోప్ ఆపరేషన్ వాక్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

దోమలగూడలో రోప్ ఆపరేషన్

కవాడిగూడ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి) : పుట్ పాతులు ఆక్రమించే వారిపై చర్యలు తీసుకుంటామని సెంట్రల్, ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ అన్నారు. 2025 రోడ్డు భద్రతా మాసం సందర్భంగా సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ పర్యవేక్షణలో దోమలగూడ ఏవీ కాలేజ్ జంక్షన్ నుంచి గగన్‌మహల్‌రోడ్డు వరకు బుధవారం రోప్ వాక్ ఆపరేషన్ నిర్వహించారు. పుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణలు తొలగించడం, వీధి వ్యాపారులకు రోప్ ఆపరేషన్ ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పాదచారులకు కాలిబాట మార్గాలు ఏర్పాటు చేశారు.

ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం కృషి చేస్తోంది

- 19న జరగాల్సిన మాదిగల మహాగర్జన సభ వాయిదా



మాట్లాడుతున్న వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాంనగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 19న ఇందిరాపార్కు వద్ద జరగబోయే మాదిగల మహాగర్జనను వాయిదా వేసి. అదే రోజు రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌ను హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య పేర్కొన్నారు. బుధవారం బంజాహిల్స్‌లోని మంత్రుల క్వార్టర్స్‌లో మేడి పాపయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, ఏకసభ్య కమిషన్ రిపోర్ట్ అందగానే వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాట్లాడుతూ అంబేడ్కర్ అభయహస్తం పథకం ద్వారా 12 లక్షలు మాదిగ, మాదిగ ఉపకులాలకు అందేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల శ్రీనివాస్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులిజాల గెల్వయ్య, ఉత్తర తెలంగాణ అధ్యక్షుడు కె.దాసుమోహన్; దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మంచాల యాదగిరి, నాయకులు జి.డి.నర్సింహ, జి. సుదర్శన్, బి.ప్రభాకర్, పి.లక్ష్మణ్, రుక్కమ్మ, జ్యోతి, నిర్మల, భీమ్ పాల్గొన్నారు.



బల్వీర్‌ను సత్కరిస్తున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

గ్రేటర్‌పై కమలం జెండా ఎగరవేయడమే

లక్ష్యంగా ముందుకు సాగాలి: గౌతమ్‌రావు

బర్కత్‌పుర, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కమలం జెండా ఎగరవేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని నగర కార్యాలయంలో కాచిగూడ డివిజన్ నూతన అధ్యక్షుడిగా నియమితులైన టి.బల్వీర్‌కు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో వైఫల్యం చెందుతుందని ఆరోపించారు. నూతన డివిజన్ అధ్యక్షులు ఆయా డివిజన్లలో పార్టీని బలోపేతం చేయడానికి అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, కోశాధికారి ఏ.సూర్యప్రకాష్‌సింగ్, ఎక్కాల నందు, క్షీరసాగర్, అరవింద్, చిట్టి శ్రీధర్, సుభాష్‌పటేల్, ఆర్.సంతోష్, లావణ్య పాల్గొన్నారు.

మణిశాస్త్రికి 'మధురగాన తోజో దివ్వమణి' బిరుదు



ప్రముఖ గాయనీ మణిశాస్త్రిని సత్కరిస్తున్న వెంకట్ గరికపాటి తదితరులు

రాంనగర్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): రాయిని సహితం కరిగించి, మనిషి రోగాన్ని నయం చేసే కళ... సంగీతం సొంతమని ప్రముఖ సాహితీవేత్త, జనరల్ మేనేజర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వెంకట్ గరికపాటి అన్నారు. అంతటి విలువలు ఉన్న సంగీతాన్ని అదే స్థానంలో ఆలోచించే అతి కొద్దిమంది లెజెండరీ సింగర్‌లలో మణిశాస్త్రి ఒకరని ఆయన కొనియాడారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో శ్రీరామ సాంస్కృతిక సేవా సంస్థ, నాద వినోద సంగీత అకాడమీ (యూఎస్‌ఏ) ఆధ్వర్యంలో గాయనీ మణిశాస్త్రి సమర్పణలో సినీనటి జయప్రద 50 ఏళ్ల సినీ ప్రస్థానం సందర్భంగా స్వర్ణోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ఉద్దండులైన సంగీత విద్వాంసుల వద్ద శిష్యరికం చేసి బాల్యంలోనే సినీ సంగీతంపై ఆకర్షితురాలై ఎంతోమంది విద్యార్థులను తయారు చేసిన మణిశాస్త్రి అభినందనీయురాలని అన్నారు. ఈ సందర్భంగా అమెరికాకు చెందిన గాయని మణిశాస్త్రికి 'మధురగాన తేజో ద్వీమణి' బిరుదును అంకితం చేశారు. గాయకులు చిలువేరు శ్రీకాంత్, రాజు, హర్షరమణి, శృతిపవన్‌శర్మ, వేణు శ్రీరంగం, శేషకుమారి ఆలపించిన సినీ గీత మాధుర్యం పాటకులను ఆలరించింది.

2న ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శతజయంతి

హైదరాబాద్ సిటీ, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): నిజాం వైద్య విజ్ఞాన సంస్థ మాజీ వ్యవస్థాపక డైరెక్టర్ పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శతజయంతి సందర్భంగా వచ్చే నెల 2వ తేదీన క్రెస్ట్ ఆడిటోరియంలో రేడియాలజీ జాతీయ సదస్సును సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ తెలంగాణ శాఖ, నిజాం వైద్య విజ్ఞాన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను నిమ్స్‌లో బుధవారం సంచాలకులు డాక్టర్ బీరప్ప నగరి, డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్, నిమ్స్ రేడియో డయాగ్నోసిస్ విభాగపు అధిపతి డాక్టర్ అను కపూర్ ఆవిష్కరించారు. అలాగే, ఉత్తమ పరిశోధన పత్రానికి ప్రొఫెసర్ కాకర్ల ఉత్తమ శాస్త్రీయపత్రం పేరిట నగదు బహుమతి, మెమొంటోతో సత్కరిస్తారు. ఈ సందర్భంగా రేడియాలజీ విభాగంలో ఉత్తమ సేవలందించిన రేడియోగ్రాఫర్‌కి డాక్టర్ కాకర్ల జీవనసాఫల్య అవార్డు బహూకరించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది అవార్డును ముంబాయి లోని టాటా మెమోరియల్ ఆస్పత్రి టెక్నికల్ ఆఫీసర్ శంకర్ కె భగత్ కు ప్రదానం చేయనున్నారు. సదస్సులో వైద్యులు జె.జగన్ మోహన్‌రెడ్డి, విజయానంద్ ఎచ్ కేల్కరి, రామకృష్ణ, రావూరి పవర్, పన్నీర్ సెల్వం, గడ్డం గంగాధర్, అర్జున్ మంజే గౌడ, సుజాత పట్నాయక్ వివిధ అంశాలపై అతిథి ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. అలాగే పలు రాష్ట్రాల నుంచి రేడియాలజీ విద్యార్థులు వేర్వేరు అంశాలపై పరిశోధన పత్రాలు సమర్పించనున్నారు. కార్యక్రమంలో నిమ్స్ వైద్య అనుబంధ వృత్తి కళాశాల ప్రిన్సిపాల్ శిరందాస్ శ్రీనివాస్, సొసైటీ ఆఫ్ ఇండియన్ రేడియోగ్రాఫర్స్ అకాడమిక్ డైరెక్టర్, కార్యక్రమం ఛైర్‌పర్సన్ దామోదర నాయుడు పాల్గొన్నారు.



శబరిమలకు బయలుదేరిన అయ్యప్ప భక్తులు

48 రోజులు దీక్షను పూర్తి చేసిన బాగ్‌అంబర్‌పేట డివిజన్ డీడీ కాలనీ అయ్యప్ప భక్తులు ప్రవీణ్‌స్వామి, గణేష్, రవికాంత్, వెంకట్ ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.
- రాంనగర్, ఆంధ్రజ్యోతి.



సంక్రాంతి పండగను పురస్కరించుకుని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్‌కు పతంగిని అందజేసి పండుగ శుభాకాంక్షలు చెబుతున్న లేబర్ బోర్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు ధాత్రిక్ చందులాల్ పటేల్
- రాంనగర్, ఆంధ్రజ్యోతి

చేనేతకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న డా. చిక్కా దేవదాసు

చిక్కడపల్లి, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలో చేనేతకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని చేనేత వర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు డా. చిక్కా దేవదాసు డిమాండ్ చేశారు. బుధవారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన వేదిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రప్రభుత్వానికి చేనేత కార్మికులపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. ప్రత్యేకమంత్రిత్వశాఖను ఏర్పాటు చేసి రూ.2 వేల కోట్ల బడ్జెట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చేనేత సహకారసంఘాలకు 11 ఏళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా, ఆప్కోకి పాలకవర్గాన్ని నియమించకుండా కాలయాపన చేయడంవల్ల సహకార సంఘాలు దెబ్బతిన్నాయన్నారు. సీఎం చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు రామదాసు, కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బాకారంలో పతంగులు ఎగురవేస్తున్న ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, బీజేవైఎం నగర అధ్యక్షుడు శివాజీ



ముషీరాబాద్‌లో గాలిపటం ఎగురవేస్తున్న ముఠా జైసింహ తదితరులు



రాంనగర్‌లో పతంగి ఎగురవేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు నాగేష్ ముదిరాజ్ తదితరులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

- పతంగులు ఎగురవేసిన యువత, పెద్దలు
- మహిళలకు ముగ్గుల పోటీలు



భరత్‌నగర్‌లో పిల్లలతో కలిసి పతంగులు ఎగురవేస్తున్న ఎండీ మోహిన్ తదితరులు

ముషీరాబాద్, జనవరి 15 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను ముషీరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఇంటి ముందు మహిళలు తెల్లవారుజామున రంగురంగుల ముగ్గులు వేశారు. మధ్యాహ్నం తర్వాత యువత, చిన్నపిల్లలు, పెద్దలు ఇళ్లపై ఎక్కి గాలిపతంగులు ఎగురువేశారు. ఆకాశంలో రెపరెపలాడే గాలిపటాలు, యువకుల నృత్యాలు, కేరింతల మధ్య సౌండ్‌బాక్స్ పాటలతో ఉత్సాహంగా సాగింది. ఎమ్మెల్యే ముఠాగోపాల్‌ను పలువురు నేతలు కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



ముషీరాబాద్‌లో పతంగులు ఎగురవేస్తున్న డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పార్టీ నేతలు

కళాధర్‌నగర్‌లో ముగ్గుల పోటీ



కళాధర్‌నగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుప్రియా

ముషీరాబాద్ డివిజన్ కళాధర్‌నగర్‌లో కళాధర్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ముగ్గులను పరిశీలించి విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మెట్టు వాసు, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎం. నవీన్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు కంచి కుమార్ ముదిరాజ్, నాయకులు లక్ష్మణ్, వెంకటేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు. పద్మశాలీ కాలనీలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు కాలనీ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు సుందర్‌పటాలే, ఆర్. ఆంజనేయులు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, కమల్‌కుమార్ శర్మ, సుజాత, ఉమా పాల్గొన్నారు.